

# ఆడపిల్ల అద్దె ఇల్లు

—కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు

తెలతెలవారుతూంది. కుళాయి శబ్దం విని సావిత్రమ్మ త్రుళ్ళిపడి లేచింది. ఆదరాబాదరాగా పెరట్లోకి వెళ్ళి కుళాయికి రబ్బరు ట్యూబు తగిలించి తొట్టెలోకి నీళ్ళు పదుతూంది. రాత్రంతా నీళ్ళ ధ్యాసతో ఆవిడ ఆదమరచి నిద్రపోదు. మూడు వాటాలకు వున్నది ఒక్కటే పంపు. ఆ ఇంటికి నుయ్యి కూడా లేదు. ఆలస్యం చేస్తే ప్రక్కవాటా వాళ్ళు పంపు ఆక్రమిస్తారు. రోజంతా స్నానాలకు, బట్టలకు, చివరకు త్రాగేందుకూ నీళ్ళు దక్కవు. పోనీ, వీధి కుళాయికి వెళదామా అంటే అక్కడ కరాటే వచ్చిన ఆడవాళ్ళకు తప్పితే కళ్ళాపు చల్లేవాళ్ళకు నీళ్ళు పుట్టవు. మూడవ ప్రపంచ యుద్ధానికి జరుగుతున్న సంరంభం అక్కడ కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. రాజకీయ నాయకులు సహితం వాడని భాష, తెగింపు వాళ్ళలో మనకు కనబడుతుంది. ఈసారి ప్రపంచ యుద్ధానికి అణుబాంబులు అవసరం లేదు. ఆడవాళ్ళని పంపితే చాలు. అందుకే ఆవిడకు ఆ ఛాయలకు పోవాలంటే పోలీసు స్టేషనుకు రమ్మన్నంత దడ.

పట్టుమని పది బిందువులు- బిందెలు కావు పట్టుకుందో లేదో పెట్టిన ట్యూబు పట్టు తప్పింది. అందుకు కారణం ఆ ఇంటి యజమానురాలే. ఆవిడ ఎప్పుడు కావాలంటే అప్పుడు అలా చేయగలదు. (మూడు వంతులకు పైగా మెజారిటీ వున్న ప్రభుత్వపు పోకడ ఆవిడది.)

సావిత్రమ్మకు చిర్రెత్తుకొచ్చింది. 'శత్రువత్ ఆదేశః' అన్నట్లు వచ్చింది. గట్టిగా నోరుచేసుకుందామా అంటే అద్దెకిచ్చేముందు ఆవిడ విధించిన ఆంక్షలు గుర్తుకు వచ్చాయి. పోనీ మరో ఇల్లు చూసుకుందామా అంటే ఈ రోజుల్లో అతికష్టం మీద ఉద్యోగాలన్నా దొరుకుతాయేమోకాని అద్దె ఇళ్ళు దొరకవు. ఇల్లునిచ్చే ముందు కూడా తీయని ఆరాలు తీస్తారు. కులం, గోత్రం, ఉద్యోగం, సంతానం అన్నీ చూసి నచ్చితేనే ఇస్తారు. తీరా అద్దెకిచ్చిన తర్వాత అత్తగారి ఆరళ్ళు, రోట్లో పప్పు రుబ్బు కోవాలంటే వాళ్ళ పర్మిషను తీసుకోవాలి. రెండవ ఆట సినిమాకు వెళ్ళకూడదు. స్నానాల గదిలోకి వెళ్ళాలంటే క్యూని పాటించాలి. తరచు బంధువులు రాకూడదు. ఈ నియమాల్లో ఏది ఉల్లంఘించినా జాతర్లో పూనకం వచ్చినట్లు విరుచుకు పడతారు. 'అదేమిటి?' అంటే ఇల్లు ఖాళీ చేయమంటారు. అసలు వాళ్ళు అటువంటి అవకాశం కోసమే చూస్తూ వుంటారు. సినీతార ఒక పాటలో పది చీరలు మారిస్తే ప్రేక్షకులు పొందే ఆనందమే ఇంటి యజమానులు అద్దెవాళ్ళని మార్చి పొందుతారు.

ఈ బాధలు పడలేక ఆమధ్య సావిత్రమ్మ ఇల్లు మారదాం కదా అని వాకబు చేయటం మొదలు పెట్టింది. విదేశీ గూఢచారిలా ఇంటి యజమానురాలు ఆ విషయం పసికట్టింది. అంతే! వెంటనే ఓ ప్రకటన చేసింది- "మా పెద్ద అబ్బాయికి ఈ ఊరు ట్రాన్స్ఫరయింది. మీలో ఎవరో ఒకరు ఖాళీ చేయాల్సి వుంటుంది" అని. ఇహ అద్దెకుండేవాళ్ళు ఆవిడ్ని కాకాలు పట్టడం ప్రారంభించారు. సావిత్రమ్మ గత్యంతరం లేక అద్దె పెంచి అందులోనే వుంటూంది. ఇన్‌కంటాక్స్‌వాళ్ళ రైడునన్నా తప్పించుకోవచ్చునేమో గానీ, ఆవిడ చేతుల్లో పడ్డవాళ్ళు తప్పించుకోలేరు.

ఇన్ని నిజాలు తెల్సిన సావిత్రమ్మ ఆవిడ నోట్లో నోరు పెట్టలేక వీధి పంపు అనే కురుక్షేత్ర రణరంగంలోకి ప్రవేశిద్దామని బయట అడుగు పెట్టింది. ఎదురుగా ఓ ఆటో వచ్చి ఆగింది. మధ్యంతర ఎన్నికల్లా చుట్టాలు ఎప్పుడు ఊడిపడతారో చెప్పలేం. తీరా చూస్తే, వచ్చింది ఎవరో కాదు! వాళ్ళ అమ్మాయి సరళ. అమ్మాయిని చూడగానే మరో సమయంలో అయితే సావిత్రమ్మ మనసు ఆనందంతో లయ తప్పేదేమో కాని, పట్టుమని పది రోజులు కూడా కాలేదు అత్తవారింటికి పంపి. బేరింగు లెటర్లా ప్రత్యక్షమయింది. ఆదుర్దా అణుచుకుంటూ సావిత్రమ్మ పలకరించింది.

"ఏమ్మా! సరళా! అక్కడ అంతా క్షేమమేనా? ఏరీ? అల్లుడుగారు? నీవు ఒక్కదానివే వచ్చావా"?

తల్లి పలుకరించిందే తడవుగా సరళ కంటి వెంట ధారాపాతంగా నీళ్ళు కారటం ప్రారంభించాయి. 'వీధిలో ఎందుకు ఈ భాగవతం' అని లోనికి పోయి నిదానంగా మళ్ళీ అదే ప్రశ్న అడిగింది.

"మీ అల్లుడు నాతో కాపురం చేయరట. పుట్టింటికి పొమ్మన్నారు" అంది సరళ.

సావిత్రమ్మ నిర్ఘాంతపోయింది. జీరోఅవర్లో ప్రతిపక్ష నాయకులు వేసిన ప్రశ్నకు అనుభవం లేని అమాత్యుడు

పెట్టిన ముఖం పెట్టింది. కోరిన కట్నం ఇచ్చింది. అలకపాన్పు మీద అలిగితే వెస్పా ఎక్స్-ఇ బ్లాకులో కొని ఇచ్చింది. అమ్మాయికి మెడనిండా నగలు దిగేసింది. కాపురానికి కావాల్సిన అన్నీ కొని పంపింది. అయినా అల్లుడి అలకకు కారణం ఆవిడకు అర్థం కాలేదు. కాస్త తెప్పరిల్లాక అడిగింది—

"అల్లుడు గార్కి కోపం ఎందుకని వచ్చింది? నీవేమైనా పరుషంగా అన్నావా?" ఆయన అలాంటి వారు కాదే. ఎందుకిలా జరిగింది".

"ఎవరు ఎలాంటివాళ్ళో ముఖం చూడగానే ఎలా తెలుస్తుంది? పైకి మంచిగా వుంటూ గమ్మత్తుగా గొంతు నులిమే రకం నీ అల్లుడు. ప్రతి చిన్నదానికి కసుర్లు, విసుర్లు. చివరికి స్కూటరు పనిచేయకపోయినా నాదే తప్పు" అంటూ సరళ ఏకరువు పెట్టింది.

"అది కాదే అమ్మాయ్! అసలు అల్లుడుగారు అలా వుండటాన్కి కారణం ఏమిటో తెలుసుకోలేక పోయావా?"

"అదీ తెల్సింది. పెళ్ళికాక ముందే ఓ ముదనష్టపు దాంతో ఆయనకు సంబంధం వుందిట".

"అదేమి చోద్యమే తల్లీ! కట్టుకున్న ఇల్లాలికంటేఅది ఎక్కువా?"

"అది నాకంటే ముందు వచ్చింది. రూలు ప్రకారం జూనియర్నే ష్రెంచ్ చేస్తారు".

"ఇదేమి రూల్సే ఖర్మ?"

"నేను ఏం చేయగలను అమ్మా! అంత ఇష్టం లేని కాపురం చేయలేను".

"అదేం మాటలే? అంత కష్టంగా వుంటే ఇక్కడే వుందు. మాకు నువ్వు బరువా? ఏదో లక్షణంగా కాపురం చేసుకుంటావని అనుకున్నాం గాని, ఇలా మూణ్ణాళ్ళ ముచ్చట అవుతుందని కలగన్నామా?" అంటూ సావిత్రమ్మ వాపోయింది.

అప్పటికే వాళ్ళ మాటలు ప్రక్కవాటాలోకి ప్రసార మయ్యాయి. ఇంటి యజమానురాలికు రిలే చేయ బడ్డాయి. తర్జన భర్జనలు అయింతర్వాత సావధానంగా ఆవిడే వచ్చింది.

"ఏమండీ! పిన్నిగారూ! అమ్మాయి అప్పుడే వచ్చేసిందే. ఏమైనా గొడవా?"

"ఏదోనండి కుటుంబ కలహం. కొద్ది రోజులు పోతే అదే సర్దుకుంటుంది" అని సావిత్రమ్మ సమాధాన పరచటానికి ప్రయత్నించింది. కానీ ఇంటావిడ అంతటితో పోనియ్యలేదు.

"అది కాదండీ! మీరు చూస్తున్నారుగా! ఇవి కాపురాలు చేసుకునే ఇళ్ళు. ఇలా భర్తను వదిలేసి వచ్చిన అమ్మాయిని చూసి మిగతా ఈడు వచ్చిన ఆడపిల్లలు చెడిపోరూ" అంటూ చాలా నిష్కారంగా అంది.

దాంతో సావిత్రమ్మ కోపం పట్టలేకపోయింది.

"ఏమంత కానిపని చేశాం మేము? ఎవరి సంసారం గొడవలు వాళ్ళకుంటాయి. ఒకళ్ళని చూసి మరొకరు చెడిపోతారా? బాగుపడతారా?" అంటూ కటువుగా అంది.

"ఏమోనమ్మా. మా ఇళ్ళలో ఇలాంటివి పనికిరావు. మీరు మరో ఇల్లు చూసుకుంటే మాకు, మీకు గౌరవం" దురుసుగా అని వెళ్ళిపోయింది.

పాపం సావిత్రమ్మ మాత్రం ఏం చేయగలదు? అద్దె ఇల్లు అయితే వెదుకుతుందేమో కానీ, అల్లుడ్ని తేగలదా? ●

### అబద్ధాలు కాని అంకెలు

ప్రపంచంలోని మొత్తం రైలు మార్గాలలో 11-5 శాతం మేరకు రష్యాలో వున్నాయి. అయితే వీటిలో 20 శాతం ప్రయాణీకుల రైళ్ళు న్నాయి. సరకు రవాణా చేసే గూడ్సుల్లో సగం శాతం సోవియెట్ రష్యాలోనే వున్నాయి.

